క్లుప్తంగా

డీవైఈఓ తనిఖీలు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీవైఈఓ డానియేల్ రాజు

సామర్లకోట: చంద్రంపాలెంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను డీవైఈఓ ఆర్.డేనియల్ రాజు బుధవారం తనిఖీ చేశారు. ఈ మేరకు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, 8వ తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌ల వివరాలను పాఠశాల హెచ్‌ఎం భాస్కరకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ట్యాబ్‌లను విద్యార్థులు ఏవిధంగా ఉపయోగిస్తున్నారో రోజూ ఉపాధ్యాయులు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, ఉపాధ్యాయుల డైరీ, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ మేరకు ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి 10వ తరగతి విద్యార్థుల విద్యపై సమీక్ష నిర్వహించారు. ఎంఈఓ వై.శివ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైల్వే ట్రాక్ మరమ్మతులు



పీబీ దేవం రైల్వే గేటులో ట్రాక్ మరమ్మతులు చేయిస్తున్న గ్యాంగ్ సిబ్బంది

సామర్లకోట: పీబీ దేవం రైల్వే గేటులోని ట్రాక్ మరమ్మతు పనులు బుధవారం కూడా కొనసాగాయి. సోమవారం ప్రారంభించిన పనులు బుధవారంతో ముగుస్తాయని రైల్వే అధికారులు ప్రకటించారు. అయితే పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామం అంతా రైల్వే గేటు అవతలి వైపు ఉండడం, మండలానికి శివారు గ్రామం కావడంతో ప్రతి పనికి సామర్లకోట, కాకినాడ రావాల్సి ఉంటుంది. గేటు మూసివేతతో పూర్తిగా ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పని ఉన్నవారు మోటారు సైకిళ్లపై గ్రామ శివారులో ఉన్న రైల్వే కాను నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం నాటికి ట్రాక్ మరమ్మతులు పూర్తవుతాయని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ దాసరి సాయిశంకర్ తెలిపారు.

అన్నదానానికి రూ.50,499 విరాళం



పంచారామ క్షేత్ర ఈఓకు విరాళం అందజేస్తున్న శ్రీరంగనాయకులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వర స్వామి ఆలయంలో అన్నదానానికి పెద్దాపురం కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మసకపల్లి శ్రీరంగనాయకులు రూ.50,499 విరాళంగా సమర్పించారు. బుధవారం తొలుత ఆయన ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించి తన తండ్రి నాగేశ్వరరావు పేరున విరాళాన్ని ఈఓ డి.నాగమల్లేశ్వరరావుకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మసకపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూమిని కాపాడాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

సామర్లకోట: వడ్రంగి పనివార్ల సంఘం ఆధ్వర్యంలో స్థానికంగా 30 ఏళ్లుగా ఉన్న తమ భూమిని కాపాడాలని బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేశారు. ఒకటో వార్డుకు చెందిన రెడ్డి శ్రీనివాసు ఇతరులకు ఈ స్థలాన్ని విక్రయించారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బొడకొండలు ఆరోపించారు. తమ స్వాధీనంలో ఉన్న భూమిని విక్రయించిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్ నయీం అహ్మద్‌లకు వినతి పత్రాలు అందజేశారు. కార్మికులకు చెందిన స్థలాన్ని కార్మికులకే అందే విధంగా చూస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. సీపీఐ నాయకులు పెద్దిరెడ్ల సత్యనారాయణ, ఎలిశెట్టి రామదాసు, జి.లోవరత్నం, కేశవరపు అప్పలరాజు, రామకృష్ణ, అన్నవరం, యండమూరి సత్యనారాయణ, కర్రి ప్రసాద్, ఎ.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తుడి చెంతకే భగవంతుడు

- నేటి నుంచి పాదగయ క్షేత్రంలో స్వామివారికి వాహన సేవలు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ప్రపంచంలో ఎవ్వరికీ లేని సప్తనారీ హంస వాహనం స్వామివారి సొంతం



సుబ్రహ్మణ్యశర్మ ఘనపాఠి



గజవాహనం



నంది వాహనం



సప్తనారీ హంస వాహనం



భూత వాహనం

పిఠాపురం: దేవుడి పెళ్లికి దేవతలంతా పెద్దలుగా వస్తారని నానుడి. అందుకే కల్యాణ మహోత్సవాల్లో దైవ దర్శనానికి భక్తులు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. అలాగే అన్ని పర్వదినాల్లో భగవంతుడే భక్తులను అనుగ్రహించడానికి గ్రామోత్సవాల రూపంలో పురవీధుల్లో దర్శనమిస్తాడు. నలుగురు బోయీలు వివిధ వాహనాలపై దేవుడిని మోసుకొస్తుంటే చూసి తరించిపోయే భక్తజనం ఆ వాహనాలపై గ్రామోత్సవం పరమార్థం తెలిస్తే మరింత తరించిపోకతప్పదు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయంతో పాటు అన్ని శివాలయాల్లోనూ ప్రతిరోజూ పరమశివుడు వివిధ వాహనాలపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు. స్థానిక పాదగయ క్షేత్రంలో గురువారం నుంచే మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా ఆయా వాహనాల పరమార్థాన్ని వేదపండితులు బ్రహ్మశ్రీ ద్విభాష్యం సుబ్రహ్మణ్య శర్మ ఘనపాఠి వివరించారు. ప్రపంచంలో ఏ ఆలయంలోనూ ఏదేవుడికీ లేని సప్తనారీ హంస వాహనం ఒక్క పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి వారికి మాత్రమే ఉందన్నారు. వందల సంవత్సరాలుగా ఈ వాహనంపై స్వామివారు ఊరేగుతున్నట్లు ఆయన తెలిపారు.

గజ వాహనం

అమృతం కోసం క్షీరసాగర మథనం చేస్తున్న సమయంలో రెండు రెక్కలు, నాలుగు దంతాలతో ఒక ఐరావతం (ఏనుగు) ప్రత్యక్షమైంది. అలా ప్రత్యక్షమైన ఐరావతంపై పరమశివుడు అధిరోహించడంతో పాటు అనుగ్రహించడంతో ఆ రూపంలో ఉండే వాహనంపై స్వామివారిని పర్వదినాల్లో ఊరేగిస్తుంటారు. గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారిని అష్టైశ్వర్యాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి.

నంది వాహనం

పరమశివుడి అనుగ్రహం కోసం నందీశ్వరుడు విశేష తపస్సు చేయగా ఆయనకు శివుడు నిత్య శివ సాన్నిధ్యాన్ని ప్రసాదించాడు. ఈ వాహనంపై స్వామివారిని దర్శిస్తే జన్మానంతరం నిత్య కైలాస ప్రాప్తిస్తుంది. సకల సౌభాగ్యాలు కలుగుతాయి.

భూత వాహనం

త్రేతాయుగంలో రావణబ్రహ్మ శివుని కటాక్షం కోసం ఘోర తపస్సు చేశారు. దానికి మెచ్చిన మహాశివుడు ఆయనకు తన గణాధిపతుల్లో మహాబలుడు అనే పేరుతో నిత్య కైలాస నివాసాన్ని ప్రసాదించాడు. ఈ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే భూత,ప్రేత, పిశాచ భయం లేకుండా ధైర్యాన్ని ప్రసాదిస్తాడు.

ద్వాదశ స్తంభ వాహనం

ద్వాదశ జ్యోతిర్లింగాలుగా వెలసిన స్వామివారి ప్రతిరూపాలుగా ద్వాదశ స్తంభాలతో ఉండే ద్వాదశ స్తంభ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే కల్యాణాలు కాని వారికి కల్యాణం అవుతుంది.

సప్తనారీ హంస వాహనం

చిత్రథుడు అనే గాంధర్వుడు సంగీత ప్రియుడు. సంగీతానికి మూలమైన సరిగమపదని అనే ఏడక్షరాల పేర్లతో ఏడుగురు కుమార్తెలకు జన్మనిచ్చాడు. ఆ ఏడుగురు కుమార్తెలు పరమశివుడుని ప్రతినిత్యం భక్తిభావంతో కొలవడంతో ప్రత్యక్షమైన శివుడు ఒక వరం కోరుకోమని చెప్పగా తమ భుజస్కందాలపై మిమ్మల్ని మోసే భాగ్యం కల్పించమని ప్రార్థించారు. వరమిచ్చిన శివుడు పిఠాపురం పాదగయ క్షేత్రంలో తపస్సు చేయడం ద్వారా మాత్రమే ఆ వరం సాధ్యమవుతుందని చెప్పడంతో వారు ఇక్కడ తపస్సు చేయగా వారికి స్వామి అనుగ్రహం లభించింది. దీంతో ఏటా మహాశివరాత్రి పర్వదినాల్లో సప్తనారీలు ఉన్న హంస వాహనంపై స్వామివారు ఊరేగుతుంటారు. ఈ వాహనం ప్రపంచంలో ఎక్కడా ఏ దేవుడికీ ఉండక పోవడం విశేషం. ఇలా మహాశివరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ ఒక్కో వాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు.

ప్రధాన కాలువలో ఆక్రమణ

అడ్డుకున్న కౌన్సిలర్లు



కాలువలో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని ప్రధాన కాలువపై గుర్తు తెలియని వ్యక్తి ఆక్రమణకు ప్రయత్నించగా అధికార పక్ష కౌన్సిలర్లు అడ్డుకున్నారు. స్థానిక గణపతి నగరం, సాయినగర్‌ల నుంచి మురుగు, వర్షపు నీరు మెహర్ కాంప్లెక్స్‌లోని డ్రైన్‌లోకి వస్తుంది. అయితే ఈ కాలువలో గోతులు తీసి ఇనుప ఊచలతో కాంక్రీట్ వేయడానికి ప్రయత్నిస్తుండగా కౌన్సిలర్లు కరణం రాజ్‌కుమార్, పాగా సురేష్‌కుమార్ గుర్తించారు. కాలువలో కాంక్రీట్ స్తంభాలు వేస్తే మురుగునీరు ఎలా పోతుందని పని చేస్తున్న కూలీలను హెచ్చరించి పనులను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీపీఓ ఫణికుమార్, సిబ్బంది సహకారంతో కాంక్రీట్ ఊచలను తొలగించారు. ప్రధాన రోడ్డులోని కాలువను ఆక్రమించడానికి ప్రయత్నిస్తుంటే అధికారులు మౌనంగా ఉండటంపై కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆక్రమణను కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్రరావు, నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, చిట్టుమాని శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు పరిశీలించారు.

పార్టీకి వారధులు గృహ సారథులు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- ఉప్పాడలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ



సచివాలయ కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



సమావేశానికి హాజరైన కన్వీనర్లు, గృహ సారథులు

కొత్తపల్లి: ప్రజలకు, పార్టీకి వారధులు గృహ సారథులు అని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని ఉప్పాడలో వేంచేసిన మత్స్యలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ ఆధ్వర్యంలో బుధవారం మండల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికే 98 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడమే గృహ సారథుల లక్ష్యమన్నారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారికి పథకాలు అందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కనీసం 5 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. హామీలు నెరవేర్చకుండా మోసం చేయడంతో టీడీపీని ప్రజలు విస్మరించాలని చెప్పారు. మన ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో ప్రజల వద్దకు వెళ్లే దమ్ము వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఏ పథకాలు రావాలన్నా లబ్ధిదారులు జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పటికే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా కుల, మతాలకు అతీతంగా అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. అయినా ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటిని తిప్పి కొట్టాలని సూచించారు. గృహసారథులు, వలంటీర్ల సమన్వయంతో పని చేయాలన్నారు. ఎల్లో మీడియా, పచ్చచొక్కా నేతలు చేస్తున్న దుష్ప్రచారానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. చంద్రబాబును రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులకు వైఎస్సార్ సీపీలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, సర్పంచుల, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



ఎమ్మెల్యే దొరబాబును గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని గ్రామ సచివాలయాలు, గృహసారథుల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అన్నారు. మండలంలోని ఉప్పాడలో బుధవారం నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఉమ్మిడి జాన్‌ను మండల కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ తనను మండల కన్వీనర్‌గా నియమించినందుకు ఎమ్మెల్యే దొరబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరాత్రికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



సామర్లకోట పంచారామ క్షేత్రంలో ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న ఆర్డీఓ వెంకటరమణ

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ అధికారులకు సూచించారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పర్వదినాలు ఒకే రోజు వచ్చిన నేపథ్యంలో ఈ ఏడాది పాదగయ క్షేత్రానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. ముఖ్యంగా పాదగయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతులు ఏర్పాటు చేయాలనానరు. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆలయ ఈఓ శ్రీనివాస్‌కు సూచించారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, పారిశుధ్య సమస్య తలెత్తకుండా తగిన సిబ్బందిని నియమించి మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్‌కు సూచించారు. ఆయన వెంట దేవదాయ ధర్మాదాయశాఖ అధికారి పులి నారాయణమూర్తి, తహసీల్దార్ త్రినాథరావు తదితరులు ఉన్నారు.

పంచారామ క్షేత్రంలో..

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం వద్ద మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను కాకినాడ ఆర్డీఓ బి.వెంకటరమణ బుధవారం పరిశీలించారు. గురువారం నుంచి 21వ తేదీ వరకూ ఆలయం వద్ద ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవదాయ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆలయ కోనేరును భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు స్వచ్ఛమైన నీటితో నింపాలని సూచించారు. ఇటీవల సమావేశంలో గోదావరి కాలువలో కాలుష్య జలాలు కలుస్తున్నాయనే ఫిర్యాదుల మేరకు ఆయా ప్రదేశాలను పరిశీలించి కాలుష్య జలాలు నివారించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. ఈ మేరకు కాలువలో గుర్రపు డెక్కను తొలగించే విధంగా ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇస్తామని ఆయన చెప్పారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేయాలని సూచించారు. వీలైన ఎక్కువ క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేక పనులు చేయించాలన్నారు. దాతల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జె.తిమ్మాపురంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన

- వైఎస్సార్ విగ్రహం చేయి ధ్వంసం చేసిన దుండగులు
- రోడ్డుపై నిరసన తెలిపిన అభిమానులు



ఘటనా స్థలం వద్ద నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెద్దాపురం: పెద్దాపురం మండలం జె.తిమ్మాపురంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహంలో కొంత భాగాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఆ గ్రామం మీదుగా రోడ్డు షో నిర్వహించనున్న నేపథ్యంలో టీడీపీకి చెందిన వారే ఈ చర్యకు పాల్పడి ఉంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ వి.సురేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే, నియోజకవర్గ స్థాయిలో పార్టీ నాయకులు, అభిమానులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని 24 గంటల్లో అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరుతూ నినాదాలు చేశారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. డీఎస్పీ విచారణను ముమ్మరం చేశారు. వైఎస్సార్ విగ్రహం వద్ద ఆందోళన చేసిన నాయకులు సాయిప్రసాద్, సూరిబాబు, బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజా సంక్షేమ పాలనను చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీల నేతలు ఈ దుర్మార్గానికి దిగజారారన్నారు. తర్వాత ఆందోళన విరమించారు.

అప్రమత్తతతో విపత్తుల నివారణ



నీటిలో మునిగిపోతున్న వారిని రక్షించే విధానం చూపిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

సామర్లకోట: అప్రమత్తతతో విపత్తులను నివారించవచ్చని, వరదల్లో చిక్కుకున్న వారిని ఏవిధంగా రక్షించాలో ఆపద మిత్రలకు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వివరించారు. తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన 105 మంది ఆపద మిత్రలకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ జరుగుతుంది. 10వ రోజు బుధవారం జి.రాగంపేట పంచాయతీ చెరువులో ఫీల్డ్ విజిట్ జరిగింది. చెరువులో మునిగిపోతున్న వారిని ఏవిధంగా రక్షించాలనే విషయాన్ని బోటు, తాళ్ల సహాయంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారులు డెమోలో చూపించారు. సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు సహకారంతో స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. తుపానులు, వరదలు వచ్చిన సమయాల్లో మత్స్య శాఖ సహకారం ఎక్కువగా ఉంటుందని విపత్తుల నివారణ సంస్థ కాకినాడ జిల్లా మేనేజర్ కిరణ్మయి తెలిపారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధి హరాచంద్ కుమార్, విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్మయి పాల్గొన్నారు.

ఆదాయం వస్తేనే అన్నింటా అభివృద్ధి

- అధికారులూ ప్రత్యేక శ్రద్ధ చూపండి
- మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సూచన
- రూ.8.78 కోట్లతో మిగులు బడ్జెట్



అధికారుల తీరును ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్, సభ్యులు



సభ్యులకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: మున్సిపాలిటీకి ఆదాయం వస్తేనే అన్ని విధాలా అభివృద్ధి చేయగలమని, ఆ దిశగా అధికారులు శ్రద్ధ చూపాలని అధికార పక్ష కౌన్సిలర్లు సూచించారు. సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన బుధవారం బడ్జెట్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు నేతల హరిబాబు, పాగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో ప్రకటనల బోర్డులు, సెల్ టవర్లు పెరుగుతున్నా ఆదాయం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటుందన్నారు. అనుమతి లేని ప్రకటనల బోర్డులను వెంటనే తొలగించాలని కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ సూచించారు. మెహర్ కాంప్లెక్స్ ప్రధాన కాలువ ఆక్రమణ జరుగుతున్నా అధికారులు మౌనం వహిస్తున్నారని కౌన్సిలర్లు కరణం రాజ్‌కుమార్, పాగా సురేష్‌కుమార్ ఆరోపించారు. ఇటీవల కాలంలో కేబుల్ ప్రచారాలకు చెందిన వైర్లు విద్యుత్తు స్తంభాలకు బిగించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రత్యేకంగా స్తంభాలు ఏర్పాటు చేసుకునే విధంగా ఆదేశాలు ఇచ్చి ప్రతి స్తంభానికి పన్నులు వేయాలని ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు సూచించారు. పట్టణంలో అమలు చేసిన బీపీఎస్ పథకానికి సొమ్మును డీఎంఏ కార్యాలయం నుంచి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ సూచించారు. పట్టణంలో కోర్టు కేసుల అపరాధ రుసుంకు సంబంధించి మున్సిపాలిటీకి వాటా వస్తుందని, దానిని వసూలు చేసినట్లు బడ్జెట్‌లో చూపించలేదని హరిబాబు అన్నారు. అదే విధంగా మైనింగ్ రాయల్టీపై కూడా దృష్టి పెట్టాలని మోజెస్ అధికారులకు సూచించారు.

కేసుల వివరాలు తెలపాలి

నెలకు రూ.15 వేల గౌరవ వేతనం తీసుకుంటున్న స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు కౌన్సిల్ సమావేశానికి హాజరై కేసుల వివరాలు తెలియజేయాలని పితాని కృష్ణ డిమాండ్ చేశారు. స్టాండింగ్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి హాజరయ్యే విధంగా చూడాలని వైస్ చైర్మన్ సూచించారు. పట్టణంలో అనేక అక్రమ కుళాయిలు ఉన్నాయని, రైల్వేకు తాగునీరు అందజేస్తున్నా పన్నులు వసూలు చేయడం లేదని, ఈ నెల నుంచి ఆ కుళాయిలకు పన్నులు వేస్తే మున్సిపాలిటీ ఆదాయం పెరుగుతుందని మోజెస్, సభ్యులు పాగా సురేష్‌కుమార్, నేతల హరిబాబు, పితాని కృష్ణ, ఆవాల లక్ష్మీనారాయణ తెలిపారు. కుళాయి మరమ్మతులు చేయమంటే రూ.ఎనిమిది వేలు కట్టాలని ఒక ఇంటి యజమానిని బెదిరించడం ఎంత వరకూ సమంజసమని 14వ వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు ఆరోపించారు. కుళాయిలకు పన్నులు వేసి లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని చైర్‌పర్సన్ అరుణ సూచించారు. తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద బడ్డీ ఏర్పాటు చేసి మద్యం తాగుతున్నారని వారా పాప ఆరోపించారు. ప్రకటనల బోర్డులను గుర్తించి పన్నులు వేస్తామని, సభ్యుల సూచనల మేరకు ఆక్రమణలపై దృష్టి పెడతామని, సెల్ టవర్‌కు ఒకే పర్యాయం రూ.10 వేలు చెల్లిస్తారని టీపీఓ ఫణికుమార్ సభ్యులకు తెలిపారు. సెల్ టవర్ ఉన్న ఇంటిని కమర్షియల్‌గా గుర్తించి పన్నులు వేస్తామని ఆర్వో పూడి రవిబాబు వివరించారు. కుళాయిలకు పన్నులు వేస్తామని, రైల్వే అధికారులు తాగునీటికి 2015 వరకూ పన్ను చెల్లించారని డీఈ హుస్సేన్ సభ్యులకు వివరించారు.

బడ్జెట్ ఆమోదం

2023–24 ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ కౌన్సిల్ రూ.8,78,25,948తో అంచనా మిగులు బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.16,79,70,345 ప్రారంభ నిల్వగా, ఆ సంవత్సరంలో ఆదాయం రూ.22,04,27,288 గాను, రూ.29,08,91,269 ఖర్చు చూపుతూ సవరణ మిగులు రూ.9,75,06,364గా బడ్జెట్‌లో చూపారు. 2023–24కు రూ.9,75,06,364 ప్రారంభ నిల్వగాను, ఆ సంవత్సరంలో అంచనా ఆదాయం రూ.22,55,53,04గా, ఖర్చులు రూ.23,52,33,500గా అంచనా వేశారు. దీంతో రూ.8,78,25, 948 ముగింపు నిల్వను అంచనా మిగులుగా బడ్జెట్‌ను తయారు చేశారు.